ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

# నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 03 సంచిక -155 పేజీలు - 04 వెల - 04/- మంగళవారం 14 జులై 2026

# పుష్కరాల నాటికి పోలవరం పూర్తి



**పిచ్చుకలంకలో రైతుల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు**

**2 ఏళ్లల్లో ఇరిగేషన్ రంగానికి రూ.24 వేలకోట్లు ఖర్చు**

**ప్రకటించిన క్యాలెండర్ కు అనుగుణంగా ఇరిగేషన్ ప్రాజెక్టులు**

**డబ్బులిచ్చి మరీ గొడ్డలి పార్టీ అరాచకాలు సృష్టిస్తోంది**

**పవన్ ను అవమానిస్తున్నారు...**

**వాళ్ల కుటుంబ సభ్యులను కించపరుస్తున్నారు**

**ధవళేశ్వరం బ్యారేజీకి రూ.153 కోట్లతో 117**

**కొత్తపేట,జూలై 13,ఆంధ్ర ప్రగతి**

గోదావరి డెల్టాకు శాశ్వత రక్షణ కల్పించే చర్యలను కూటమి ప్రభుత్వం చేపట్టిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. దీంట్లో భాగంగానే సర్ అర్థర్ కాటన్ బ్యారేజ్ కు కొత్త గేట్లను అమరుస్తున్నట్టు చెప్పారు. ధవళేశ్వరం బ్యారేజీకి రూ.152.95 కోట్ల వ్యయంతో 117 కొత్త గేట్లను అమర్చే పనులను సీఎం చంద్రబాబు ప్రారంభించారు **మిగతా 2లో..**





# నరహంతకుడు మృతి

**పురుగుల మందు తాగి ఆత్మహత్య -సూసైడ్ కు ముందు సెల్ఫీ వీడియో**

**కొత్తూరు మండలంలో ఘటన**

**వివరాలు వెల్లడించిన ఫ్యూచర్ సిటీ కమిషనర్ తరుణ్ జోషి**



**కొత్తూరుజూలై 13, ఆంధ్ర ప్రగతి**

రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలంలో అతి కిరాతకంగా ఆరుగురిని హత్య చేసిన హంతక ఉన్మాది రాజ్ కుమార్ కథ విషాదంగా ముగిసింది. కొత్తూరు మండలం పెంజర్ల గ్రామ పరిధిలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు ముందు సెల్ఫీ వీడియో సైతం తీసుకున్నాడు. కొత్తూరు మండలంలోని పెన్జర్ల రెవెన్యూ పరిధిలోని ఓ వెంచర్ సమీపంలోని **మిగతా 2లో..**

# ఇక హర్మ్యూజ్ జలసంధిని మేమే నడిపిస్తాం..

**హర్మ్యూజ్ జలసంధిని స్వాధీనం చేసుకుంటున్నామన్న ట్రంప్**

**ఒప్పందాన్ని ఉల్లంఘించి ఇరాన్ డ్రోన్లు పంపుతోందని ఆరోపణ**

**ఇరాన్‌పై రాత్రి సైనిక దాడులు చేశామని వెల్లడి**

**జలసంధి భద్రతకు ఇతర దేశాలు డబ్బు చెల్లించాలని డిమాండ్**



**న్యూఢిల్లీ,జూలై 13,ఆంధ్ర ప్రగతి**

అంతర్జాతీయ రాజకీయాల్లో తీవ్ర పరిణామాలకు దారితీసే విధంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. కీలకమైన హర్మ్యూజ్ జలసంధిని అమెరికా తన నియంత్రణలోకి తీసుకుంటుందని, ఇకపై దాని భద్రతను శాశ్వతంగా పర్యవేక్షిస్తుందని సోమవారం **మిగతా 2లో..**



# బనకచర్లపై నోటీసులు ఇవ్వడం కుదరదు

**తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీం స్పష్టీకరణ**

**పిటిషన్‌లో లోపాలు ఉన్నాయని వెల్లడి**

**న్యూఢిల్లీ,జూలై 13, ఆంధ్ర ప్రగతి**

పోలవరం, గోదావరి నీటి వినియోగం, బనకచర్ల అనుసంధానం అంశాలపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. తెలంగాణ వేసిన పిటిషన్‌పై జస్టిస్ విక్రమ్‌నాథ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. ఏపీ ప్రభుత్వానికి నోటీసులు ఇవ్వాలని, ఇంజక్షన్ ఉత్తర్వులు ఇవ్వాలని పిటిషన్‌లో కోరింది. **మిగతా 2లో..**

# పవన్ కల్యాణ్‌ను పరామర్శించిన మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవీస్

**ముంబైలో పవన్ కుడి భుజానికి శస్త్రచికిత్స**

**మూడు వారాల పాటు ఫిజియోథెరపీ అవసరమన్న వైద్యులు**




**ముంబై జూలై 13,ఆంధ్ర ప్రగతి**

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ పరామర్శించారు. భుజానికి శస్త్రచికిత్స చేయించుకుని ముంబైలోని కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పవన్‌ను **మిగతా 2లో..**

# జాడలేని వర్షాలు

**ముఖం చాటేసిన మబ్బులు**

**మళ్లీ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు**



**హైదరాబాద్,జూలై13ఆంధ్ర ప్రగతి**

తెలంగాణలో జులై నెలలోనూ ఎండలు తీవ్రత మళ్లీ మెల్లగా పెరుగుతోంది. వర్షాలు ముఖం చాటేయంతో ఎండలు కొనసాగుతున్నాయి. సాధారణంగా ఈ కాలంలో వర్షాలు కురవాల్సి ఉండగా, రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు మళ్లీ పెరిగాయి. జులై రెండో వారంలోనూ సాధారణం కంటే సుమారు **మిగతా 2లో..**

# రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య కళాశాలలకు అదనంగా 175 ఎంబీబీఎస్ సీట్లు

**పిడుగురాళ్ల ప్రభుత్వ వైద్య కళాశాలకు 100 సీట్లతో అనుమతి**

**విజయవాడ ప్రభుత్వ సిద్దార్థకు అదనంగా 75 సీట్లు**

**ఈ విద్యా సంవత్సరంలోనే 4 ప్రభుత్వ కళాశాలల్లో అదనంగా 325 సీట్లు**

**కూటమి ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ వైద్య కళాశాలలో అదనంగా 505 సీట్లు**

**ప్రైవేట్‌లో వైద్య కళాశాలల్లో 550 సీట్లు**

**కూటమి ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో అదనంగా 1055 సీట్లు**

**నీట్ మెరిట్ విద్యార్థులకు భారీ ఊరట**

**ఆనందం వ్యక్తం చేసిన వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్**



# కేంద్ర సహకారంతోనే అభివృద్ధి సాధ్యం




**పార్లమెంటులో వివిధ సమస్యలపై ప్రస్తావించాలి**

**మెట్రో, ట్రిపుల్ ఆర్ తదతిర అంశాలపై అనుమతులు రాబట్టాలి**

**ఎంపీలతో ప్రజాభవన్‌లో సిఎం రేవంత్ భేటీ**

**ఉప ముఖ్యమంత్రి భట్టి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హాజరు**

**సమావేశంలో సలహాదారు జితేందర్ రెడ్డి, ఎంపీలు హాజరు**

**హైదరాబాద్,జూలై 13,ఆంధ్ర ప్రగతి**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య పరస్పర సహకారం ఉంటేనే తెలంగాణను అభివృద్ధి పథం వైపు నడిపించగలం అని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. రాజకీయాలకు అతీతంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకోవాల్సి ఉందన్నారు. హైదరాబాద్ కు ఎఐఓ ను తీసుకురావాలి. ఇందుకు బీజేపీ ఎంపీలు చొరవ చూపాలన్నారు. మెట్రో విస్తరణకు కేంద్ర ప్రభుత్వ సహకారం అవసరం. మెట్రో విస్తరణకు సంబంధించి రుణాల పక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేసేలా చూడాలని అన్నారు. ఆర్ఆర్ఆర్ భూసేకరణ ఒక కొలిక్కి వచ్చింది.. కేంద్రం నుంచి నిధులు తెచ్చుకుని దాన్ని పూర్తి చేసుకోవాల్సి ఉందన్నారు. మూసీ పునరుజ్జీవానికి సంబంధించి కేంద్రం నుంచి అర్బన్ **మిగతా 2లో..**

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# పుష్కరాల నాటికి పోలవరం పూర్తి




.మొదటి పేజీ తరువాయి

ఈ మేరకు ధవళేశ్వరం బ్యారేజ్ వద్ద శిలాఫలాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ధవళేశ్వరం బ్యారేజీ వద్ద నీటి ప్రవాహాన్ని పరిశీలించిన ముఖ్యమంత్రి ఇరిగేషన్ అధికారులతో మాట్లాడారు. వచ్చే ఏడాది జూన్ నెలకు కొత్తగేట్ల బిగింపు ప్రక్రియను పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. గోదావరి పుష్కరాలకు గేట్లను అమర్చే పనులను పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి ప్రస్తుతం సముద్రంలోకి ఎంత నీరు వెళ్తోందని సీఎం చంద్రబాబు ఆరా తీశారు. ప్రస్తుతం 27 వేల క్యూసెక్కుల నీరు సముద్రంలోకి వెళ్తోందని అధికారులు వివరించారు. అలాగే కాల్వలకు ఎన్ని క్యూసెక్కులు విడుదల చేశారని ముఖ్యమంత్రి అడిగారు. 14,700 క్యూసెక్కుల నీరు కాల్వలకు వదిలామని అధికారులు చెప్పారు. కాల్వ చివరి భూములకూ నీరు అందేలా నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలని సీఎం ఆదేశించారు. ఈ విషయంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు బాధ్యత తీసుకోవాలని ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేశారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గంలోని పిచ్చుకలంకలో రైతులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గోదావరి డెల్టాకు దేశానికే అన్నపూర్ణ అనే ఖ్యాతి రావడానికి సర్ ఆర్థర్ కాటన్ నిర్మించిన ఆనకట్టే కారణమని, అనంతరం ఎన్టీఆర్ హయాంలో నిర్మించిన కొత్త బ్యారేజీతో మరో పంటకు సాగునీరు అందించే అవకాశం ఏర్పడిందని చంద్రబాబు గుర్తుచేశారు. 2.9 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం, 32.2 లక్షల క్యూసెక్కుల వరదను తట్టుకునే సామర్థ్యంతో పాటు ఈస్టర్న్, సెంట్రల్, వెస్ట్రన్ డెల్టాల్లో కలిపి 10.13 లక్షల ఎకరాలకు సాగునీరు అందేలా బ్యారేజీ ఉపయోగపడుతోందన్నారు. అయితే 50 ఏళ్లకు పైగా గేట్లు, మోటార్లు, విద్యుత్ వ్యవస్థలు పాతబడటంతో వాటి ఆధునీకరణ అత్యవసరమైందని ముఖ్యమంత్రి చెప్పారు. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం రూ.32 కోట్లతో కొత్త గేట్లను అమర్చిందని, ఇప్పుడు మిగిలిన పాత గేట్ల స్థానంలో 117 కొత్త గేట్లను తొమ్మిది నెలల్లో అమర్చేలా చర్యలు ప్రారంభించామని సీఎం తెలిపారు. గత పాలకులు ఇరిగేషన్ ప్రాజెక్టులను కనీస నిర్వహణ కూడా చేపట్టలేదని విమర్శించారు. గేట్లు కొట్టుకుపోయినా పట్టించుకోలేదని... కనీసం గ్రీజ్ పెట్టేందుకు అవసరమైన నిధులను కూడా గత పాలకులు ఇవ్వలేదని ముఖ్యమంత్రి అన్నారు. తుంగభద్ర ప్రాజెక్టుకు మొత్తంగా కొత్త గేట్లను బిగించామని వివరించారు. తాము గత రెండేళ్లలోనే సాగునీటి రంగానికి రూ.24 వేల కోట్లు వెచ్చించామని ముఖ్యమంత్రి తెలిపారు.పోలవరం నిర్వాసితులను ఆనందంగా ఉంచుతాంఒకప్పుడు కోనసీమలో వరికి మద్దతు ధర లేక రైతులు క్రాప్ హాలిడే ప్రకటించే పరిస్థితి నెలకొంటే, ఇప్పుడు రైతుల ధాన్యానికి గిట్టుబాటు ధరతో పాటు విక్రయించిన 24 గంటల్లోనే డబ్బులు వారి ఖాతాల్లో జమ చేస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని, అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో గత ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించిందని సీఎం విమర్శించారు.

2014-19 మధ్య 72 శాతం పనులు పూర్తిచేయగా, ఆ తర్వాత ఐదేళ్లలో కేవలం 2 శాతం పనులు మాత్రమే జరిగాయని అన్నారు. టీడీపీ ప్రభుత్వం కొనసాగి ఉంటే 2021 నాటికే పోలవరం పూర్తయ్యేదని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పనులు వేగవంతమై ప్రస్తుతం 89 శాతం పురోగతి సాధించామని తెలిపారు. నిర్వాసితులకు పూర్తి న్యాయం చేస్తామని, పునరావాసం, పరిహారం విషయంలో ఎలాంటి రాజీ ఉండదన్నారు. వారిని ఆనందంగా ఉంచుతామని... అనుకున్న సమయానికి పోలవరం ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. ప్రకటించిన క్యాలెండర్ కు అనుగుణంగా ఇరిగేషన్ ప్రాజెక్ట్ పనులు చేపడుతోందని చెప్పారు. పోలవరం పూర్తయితే గోదావరి జిల్లాలకు నీటి సమస్య శాశ్వతంగా తీరుతుందని, పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను కృష్ణా డెల్టా, రాయలసీమకు తరలించి అక్కడి వ్యవసాయ రూపురేఖలనే మార్చామని ముఖ్యమంత్రి వివరించారు. మైక్రో ఇరిగేషన్ విస్తరించడంతో ఉద్యాన పంటలు అభివృద్ధి చెందాయని, పరిశ్రమలకు నీటి సరఫరా సాధ్యమై కియా వంటి భారీ పరిశ్రమలు రాయలసీమకు వచ్చాయని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.కూటమిపై గోదావరి జిల్లాల ప్రజల అభిమానం తరగనిదిగోదావరి ప్రజలు అభివృద్ధిని ఆదరించే స్వభావం కలవారని, గతంలోనూ టీడీపీకి అపూర్వ ఆదరణ ఇచ్చారని చంద్రబాబు గుర్తు చేశారు. 2024 ఎన్నికల్లో కూటమికి ఇచ్చిన భారీ విజయాన్ని రాష్ట్ర అభివృద్ధికి ఇచ్చిన ఆశీర్వాదంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజల సహకారం, భగవంతుడి ఆశీస్సులతో ఆర్థిక సవాళ్లను అధిగమించి రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామని ముఖ్యమంత్రి చెప్పారు. గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, పుష్కర ఘాట్ల అభివృద్ధితో పాటు రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల్లో సుమారు రూ.1,200 కోట్లతో మౌలిక వసతులు కల్పించనున్నట్లు వెల్లడించారు. విచ్చుకలంక, బొబ్బర్లంక ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేస్తామని, కోనసీమకు రైల్వే లైన్ తీసుకొచ్చేందుకు కృషి చేస్తామని చెప్పారు. కోవ్వూరులో కోకో సిటీ ఏర్పాటు చేయనున్నట్లు కూడా ప్రకటించారు. ఆక్వా రైతులకు యూనిట్‌కు రూ.1.50కే విద్యుత్ అందిస్తున్నామని, మెట్ట ప్రాంతాల్లో పామాయిల్, కోకో సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం ఇస్తోందని చెప్పారు. వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గుతున్న నేపథ్యంలో రైతులు పంటల ఎంపికలో శాస్త్రీయ విధానాలు అనుసరించాలని సీఎం సూచించారు.అభివృద్ధి-సంక్షేమమే కూటమి లక్ష్యంరాష్ట్ర పునర్నిర్మాణమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ప్రధాని నరేంద్ర మోదీ, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తో కలిసి ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతున్నామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ నెలలోనే తల్లికి వందనం నిధులు జమ చేస్తామని, సామాజిక భద్రత పెన్షన్లు, రైతు సంక్షేమ కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతున్నాయని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్నప్పటికీ ప్రజల మధ్యకే రావాలనే తపనతో ఉన్నారని, ముంబై వెళ్లి ఆయనను పరామర్శించి పూర్తిగా కోలుకున్న తర్వాతే ప్రజాసేవలో పాల్గొనాలని సూచించినట్లు చెప్పారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్, రౌడీయిజంపై రాజీపడబోమని సీఎం హెచ్చరించారు. మహిళలపై అసభ్యకర వ్యాఖ్యలు, వ్యక్తిత్వ హననం, సోషల్ మీడియా దుర్వినియోగాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందన్నారు. గంజాయిని ప్రోత్సహించే వారిపైనా, మహిళలను కించపరిచే వారిపైనా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రౌడీలతో, బ్లేడ్ బ్యాచ్, గంజాయి బ్యాచ్ లను మించి గొడ్డలి పార్టీతోనే సమస్యలు సృష్టిస్తోందని సీఎం మండిపడ్డారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కుటుంబ సభ్యులపై అసభ్యంగా మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారని... ఆడవాళ్లని అసభ్యంగా మాట్లాడే వారిని గొడ్డలి పార్టీ సమర్థిస్తోందని విమర్శించారు. సోషల్ మీడియాను దుర్వినియోగం చేస్తూ... గొడ్డలి పార్టీ నేతలు ఫైనాన్స్ చేస్తున్నారు.. స్టూడియోలు పెట్టిస్తున్నారని విమర్శించారు. గంజాయి, బ్లేడ్ బ్యాచ్ లను గొడ్డలి పార్టీ సపోర్ట్ చేస్తోందని... వారికి డబ్బులిచ్చి ప్రోత్సహిస్తోందని ముఖ్యమంత్రి చెప్పారు. వీళ్లపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని సీఎం చంద్రబాబు వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, కందుల దుర్గేష్, పొంగూరు నారాయణ, వాసంశెట్టి సుభాష్, ఎంపీ గంటి హరీష్, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## బనకచర్లపై నోటీసులు ఇవ్వడం కుదరదు

మొదటి పేజీ తరువాయి

తెలంగాణ ప్రభుత్వ అభ్యర్థనను సుప్రీంకోర్టు నిరాకరించింది. ప్రధాన పిటిషన్‌లో లోపాలు ఉన్నాయని ధర్మాసనం పేర్కొంది. లోపాలు సరిదిద్దే వరకు విచారణ చేపట్టడం కుదరదని స్పష్టం చేసింది. 15 మంది ప్రతివాదులు ఉన్నారని తెలంగాణ ప్రభుత్వ న్యాయవాది కోర్టుకు తెలిపారు. లోపాలు సరిదిద్దాక విచారణలో మిగతా అంశాలు పరిశీలిస్తామని కోర్టు పేర్కొంది. పిటిషన్‌పై విచారణ జరపకుండా నోటీసులివ్వలేమని తెలిపింది. బనకచర్ల ప్రాజెక్టుకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ వ్యవహారంలో ఏపీ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేయాలన్న తెలంగాణ ప్రభుత్వ విజ్ఞప్తిని సుప్రీంకోర్టు నిరాకరించింది. జస్టిస్ విక్రమ్ నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ సందర్భంగా, ఈ పిటిషన్ నిబంధనలకు విరుద్ధంగా లిస్ట్ అయ్యిందంటూ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఒరిజినల్ సూట్ విషయంలో నిబంధనల ప్రకారమే విచారణకు రావాలని స్పష్టం చేసింది.రిజిస్ట్రీ రూల్స్ ప్రకారం ఇటువంటి ఒరిజినల్ సూట్ పిటిషన్‌ను ముందుగా చాంబర్ జడ్జి ముందు దాఖలు చేయాల్సి ఉంటుందని ధర్మాసనం పేర్కొంది. ఆ ప్రక్రియ పూర్తికాకముందే ప్రతివాదులకు నోటీసులు ఇవ్వకుండా నేరుగా బెంచ్ ముందుకు విచారణకు రావడాన్ని సుప్రీంకోర్టు తప్పుబట్టింది. అయితే, అప్పటి వరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేయాలని తెలంగాణ ప్రభుత్వం చేసిన వాదననూ సుప్రీంకోర్టు పట్టించుకోలేదు.

## జాడలేని వర్షాలు

మొదటి పేజీ తరువాయి

3.5 డిగ్రీల సెల్సియస్ అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వాతావరణ పరిస్థితుల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా పగటి వేళల్లో ఎండ తీవ్రత పెరిగి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా మధ్యాహ్నం సమయంలో బయటకు వెళ్లే వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం, వచ్చే రెండు రోజుల పాటు ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉంది. కొన్ని ప్రాంతాల్లో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. వృద్ధులు, చిన్నారులు, అనారోగ్య సమస్యలున్న వారు అవసరమైతే తప్ప మధ్యాహ్నం సమయంలో బయటకు వెళ్లకుండా ఉండటం మంచిదని సూచిస్తున్నారు. అలాగే తగినంత నీరు తాగడం, తేలికపాటి దుస్తులు ధరించడం, ఎండలో ఎక్కువసేపు తిరగకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

## కేంద్ర సహకారంతోనే అభివృద్ధి సాధ్యం

మొదటి పేజీ తరువాయి

ఛాలెంజ్ ఫండ్ కోసం అనుమతులు వచ్చేలా కృషి చేయాలని సూచించారు. సాగునీటికి సంబంధించి తుంగభద్ర గేట్స్ ప్రారంభోత్సవం సందర్భంగా సీఆర్ పాటిల్ తో చర్చించాం. ఉమ్మడి రాష్ట్రంలో మంజూరైన ప్రాజెక్టులకు ఆంధ్రప్రదేశ్ నుంచి ఇవ్వాల్సి ఉంది. డిండి-30 టీఎంసీలకు, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు-90 టీఎంసీలకు ఔక్షఅ ఇవ్వాల్సి ఉంది. 120 టీఎంసీలకు కేంద్రం అనుమతులు వస్తే ప్రాజెక్టులు వేగంగా పూర్తి చేసుకోవచ్చు.గోదావరి, కావేరి నదుల అనుసంధానంతో రాష్ట్రానికి ప్రయోజనం ఉంటుంది. కేంద్రం సహకరిస్తే కేంద్రం సహకరించిందని మేం నిరభ్యంతరంగా చెబుతాం. కేంద్ర ప్రభుత్వ సహకారాన్ని ఒప్పుకునేందుకు మాకు ఎలాంటి భేషజాలు లేవని అన్నారు. తుమ్మిడిహట్టి, పోర్ట్ కనెక్టివిటీ, బుల్లెట్ ట్రైన్, ఆదిలాబాద్, వరంగల్ ఎయిర్ పోర్ట్స్ కు సంబంధించిన అనుమతులు వీలైనంత త్వరగా పూర్తి చేసుకునేలా చూడాలన్నారు. ఎంపిలతో భేటీలో రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. సమావేశంలో కాంగ్రెస్ ఎంపిలతో పాటు బిజెపి ఎంపిలు ఈటెల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డిలు పాల్గొన్నారు.

## పవన్ కల్యాణ్‌ను పరామర్శించిన మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవీస్

మొదటి పేజీ తరువాయి

ఫడ్నవీస్ సోమవారం కలిసి, ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు.పవన్ కళ్యాణ్ కుడి భుజానికి శనివారం సుమారు మూడున్నర గంటల పాటు వైద్యులు విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించారు. 2016లో ఆయన భుజానికి గాయమవగా, ఇటీవలి రాజకీయ పర్యటనల్లో అభిమానులు, కార్యకర్తల తాకిడి కారణంగా ఆ గాయం తీవ్రతరమైంది. దీంతో వైద్యులు శస్త్రచికిత్స చేయాలని సూచించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని, వేగంగా కోలుకుంటున్నారని వైద్య బృందం వెల్లడించింది.ఆదివారం నాడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు పలువురు మంత్రులు, ఎంపీలు ఆసుపత్రికి వెళ్లి పవన్‌ను పరామర్శించారు. ఆయనను విశ్రాంతి తీసుకోవాలని కోరుతూ, త్వరగా కోలుకుని ప్రజాసేవలో పాల్గొనాలని ఆకాంక్షించారు. వైద్యుల సూచనల మేరకు పవన్ మూడు వారాల పాటు ఫిజియోథెరపీ తీసుకోవాల్సి ఉంటుంది. ఆరు నెలల తర్వాత ఆయన ఎడమ భుజానికి కూడా వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ఫడ్నవీస్ పరామర్శ రాజకీయాలకు అతీతంగా నాయకుల మధ్య ఉన్న సౌభ్రాతృత్వానికి నిదర్శనంగా నిలిచింది. తనను పరామర్శించినందుకు ఫడ్నవీస్‌కు పవన్ కృతజ్ఞతలు తెలిపారు.

## నరహంతకుడు మృతి

మొదటి పేజీ తరువాయి

వ్యవసాయ పొలంలో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు డయల్ 100కు కాల్ చేసి సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసు సిబ్బంది రాజ్‌కుమార్ మృతదేహాన్ని గుర్తించేందుకు మృతిని సోదరుడు, పెంజర్ల గ్రామంలో నివాసముండే మేనమామలను పిలిపించారు. వారు రాజ్ కుమార్ (29) మృతదేహాన్ని గుర్తించారు. మృతుని పక్కన పురుగుల మందు డబ్బా పడి ఉంది. ఘటనా స్థలాన్ని ఫ్యూచర్ సిటీ కమిషనర్ తరుణ్ జోషి పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. నిందితుడు రాజ్‌కుమార్.. షాబాద్‌లో ఓ బాలికను ప్రేమ పేరుతో వేధిస్తూ ఉండేవాడు. దాంతో మే నెలలో ఇతనిపై బాలిక బంధువులు ఫిర్యాదు చేయడంతో షాబాద్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో కింద కేసు నమోదు చేశారు. పోక్సో కేసు పెట్టారన్న కోపం పెంచుకున్న నిందితుడు.. శుక్రవారంఅర్ధరాత్రి బాలిక ఇంటికి వెళ్లి.. ఆమె తల్లి, అమ్మమ్మను కత్తితో పొడిచి హత్య చేశాడు. అనంతరం బాలికను తీసుకొని దైవాలగూడానికి చేరుకొని, అతని సొంత ఇంట్లో భార్య, ఇద్దరు కుమారులను కుడా కత్తితో పొడిచి చంపాడు. తిరిగి అక్కడ నుండి బాలికను తీసుకొని సుమారు 200 మీటర్ల దూరంలో బాలికను కూడా హత్య చేసి పరారయ్యాడు. అనంతరం అతని తండ్రికి ఫోన్ చేసి.. 'నేను ఆరుగురిని హత్య చేశాను.. నేను కూడా ఆత్మహత్య చేసుకుంటున్న' అని చెప్పాడు. అయితే ఆరుగురి హత్య రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. పోలీసులు 12 బృందాలుగా ఏర్పడి నిందితుని కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో సోమవారం కొత్తూరు మండలం పెంచర్ల రెవెన్యూ పరిధిలోని ఓ వెంచర్‌లో మృతదేహం కనిపించింది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి చూడగా.. ఆ మృతదేహం రాజ్ కుమార్‌దిగా గుర్తించారు. మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నిందితునికి ఆన్‌లైన్ బెట్టింగ్ కూడా అలవాటు ఉంది. ఆన్‌లైన్ బెట్టింగ్ పెట్టి సుమారు రూ.2కోట్లు అప్పు చేశాడు. దాంతోపాటు అతడు 16 సిమ్ కార్డులను తీసుకొని నెంబర్లు మారుస్తూ వాడుతున్నాడు.

**వాడిని అంత ప్రశాంతంగా చనిపోనియాల్సింది కాదు..: (మృతుని సోదరుడు భాస్కర్**

అభం శుభం తెలియని పసిపిల్లలతోపాటు మరో ముగ్గురి ప్రాణాలు తీసిన రాజ్‌కుమార్ అంత ప్రశాంతంగా చనిపోవాల్సింది కాదని, వాడిని ఎన్‌కౌంటర్ చేసి చంపాల్సిందని మృతుని సోదరుడు భాస్కర్ అన్నారు. వాడి వల్ల ఎన్నో కుటుంబాలు నాశనం అయ్యాయని ఏడుస్తూ పోలీసుల ముందు మొరపెట్టుకున్నాడు.

## ఇక హర్మూజ్ జలసంధిని మేమే నడిపిస్తాం..

మొదటి పేజీ తరువాయి

స్పష్టం చేశారు. ఇరాన్ ఒక సైనిక ఒప్పందాన్ని ఉల్లంఘించి, ఈ వ్యూహాత్మక జలమార్గంలోకి డ్రోన్లను పంపడమే ఇందుకు కారణమని ఆయన ఆరోపించారు.

ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ, "మేం హర్మూజ్ జలసంధిని స్వాధీనం చేసుకుంటున్నాం. ఇక వాళ్ల దగ్గర ఏమీ లేదు" అని వ్యాఖ్యానించారు. ఇరాన్‌కు చెందిన సైనిక ఆస్తులే లక్ష్యంగా నిన్న రాత్రి అమెరికా దాడులు చేసిందని, డ్రోన్ల కార్యకలాపాలు కొనసాగితే ఇలాంటి దాడులు మరిన్ని ఉంటాయని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. "నిన్న రాత్రి వారిపై తీవ్రంగా దాడులు చేశాం. వాళ్లు డ్రోన్ పంపిన ప్రతిసారీ మేం గట్టిగా బదులిస్తాం. వారి యాంటీ-ఎయిర్‌క్రాఫ్ట్ గన్‌తో సహా చాలా పరికరాలు ధ్వంసమయ్యాయి" అని ట్రంప్ తెలిపారు.ఇరాన్‌తో సుదీర్ఘ చర్చల అనంతరం ఒక ఒప్పందం కుదిరిందని, అయితే చివరి నిమిషంలో ఇరాన్ ప్రతినిధులు మార్పులు కోరడంతో అది విఫలమైందని ట్రంప్ వెల్లడించారు. "మా మధ్య ఒక డీల్ కుదిరింది. 11 గంటల సమావేశం తర్వాత వాళ్లు అన్నింటికీ ఒప్పుకున్నారు. కానీ తర్వాత ఫోన్ చేసి మార్పులు కోరారు. అందుకే మేం ఆ ఒప్పందాన్ని పక్కనపెట్టాం" అని వివరించారు.ఇకపై హర్మూజ్ జలసంధి భద్రత బాధ్యతను అమెరికానే తీసుకుంటుందని, అవసరమైతే తామే దాన్ని నడిపిస్తామని ట్రంప్ పేర్కొన్నారు. "ఈ జలసంధికి మేం సంరక్షకులుగా మారతాం" అని ఆయన వ్యాఖ్యానించారు. అయితే, ఈ భద్రతను ఉచితంగా అందించబోమని, ఈ మార్గం ద్వారా లబ్ధి పొందుతున్న సంపన్న దేశాలు అమెరికాకు అందుకు అయ్యే ఖర్చును చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. "మా సైనికులను ప్రమాదంలోకి నెట్టి భద్రత కల్పిస్తున్నందుకు మాకు డబ్బు చెల్లించాలి" అని ట్రంప్ స్పష్టం చేశారు.పర్షియన్ గల్ఫ్‌ను అరేబియా సముద్రంతో కలిపే హర్మూజ్ జలసంధి, ప్రపంచ ఇంధన రవాణాలో అత్యంత కీలకమైనది. గల్ఫ్ దేశాల నుంచి భారత్ సహా ఇతర ఆసియా దేశాలకు చమురు, గ్యాస్ ఎగుమతులు ఈ మార్గం గుండానే జరుగుతాయి.

# రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య కళాశాలలకు అదనంగా 175 ఎంబీబీఎస్ సీట్లు

**పిడుగురాళ్ల వైద్య కళాశాలకు 100 సీట్లతో అనుమతి**

**విజయవాడ ప్రభుత్వ సిద్దార్థకు అదనంగా 75 సీట్లు**

**ఈ విద్యా సంవత్సరంలోనే 4 ప్రభుత్వ కళాశాలల్లో అదనంగా 325 సీట్లు**

**కూటమి ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ వైద్య కళాశాలలో అదనంగా 505 సీట్లు**

**ప్రైవేట్‌లో వైద్య కళాశాలల్లో 550 సీట్లు**

**కూటమి ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో అదనంగా 1055 సీట్లు**

**నీట్ మెరిట్ విద్యార్థులకు భారీ ఊరట**

**ఆనందం వ్యక్తం చేసిన వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్**



**అమరావతి,జూలై 13,ఆంధ్ర ప్రగతి**

ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ వైద్య విద్య విస్తరణలో మరో కీలక ముందడుగు పడింది. జాతీయ వైద్య మండలి (ఎన్ఎంసి) రాష్ట్రంలోని రెండు ప్రభుత్వ వైద్య కళాశాల(పిడుగురాళ్ల, విజయవాడ)ల్లో 175 ఎంబీబీఎస్ సీట్ల భర్తీకి ఆమోదం తెలిపింది. వీటితో కలిపి ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వ వైద్య కళాశాలల్లో కొత్తగా లభించిన సీట్ల సంఖ్య 325కు చేరింది. పిడుగురాళ్ల వైద్య కళాశాలలో 2026-27 విద్యా సంవత్సరంలో 100 సీట్లతో ప్రవేశాలు జరిపేందుకు ఎన్ఎంసి అనుమతినిచ్చింది. అదే విధంగా విజయవాడ ప్రభుత్వ సిద్దార్థ వైద్య కళాశాలకు అదనంగా 75 సీట్లను ఎన్ఎంసి మంజూరు చేసింది. ఈ మేరకు జాతీయ వైద్య మండలి(ఎన్ఎంసి) లెటర్ ఆఫ్ పర్మిషన్లను సోమవారం జారీ చేసింది. ఇప్పటికే కడప ప్రభుత్వ వైద్య కళాశాలకు 75, నెల్లూరు ఏసీఎస్ఆర్ ప్రభుత్వ వైద్య కళాశాలకు 25 సీట్ల పెంపునకు ఎన్ఎంసి ఆమోదం తెలిపింది. పాడేరు ప్రభుత్వ వైద్య కళాశాలలో 50 అదనపు ప్రవేశాలు జరుగనున్నాయి. దీంతో ఈ ఒక్క విద్యా సంవత్సరంలోనే రాష్ట్రానికి ప్రభుత్వ వైద్య కళాశాల ల ద్వారా 325 అదనపు ఎంబీబీఎస్ సీట్లు లభించినట్లైంది. 2024-25 నుండి ఇప్పటి వరకు ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 505 సీట్లు అదనంగా లభించాయి. ఎంబీబీయస్ సీట్లు భారీగా పెరగడంతో ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ప్రవేశాల కోసం ఎదురుచూస్తున్న నీట్ మెరిట్ విద్యార్థులకు ఊరటనిస్తోంది. మంత్రి శ్రీ సత్యకుమార్ నిరంతర కృషి ఈ ఫలితాల వెనుక రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ చేసిన నిరంతర కృషి కీలకంగా నిలిచింది. ఎన్ఎంసి అనుమతులు పెండింగ్‌లో ఉన్న ప్రతి కళాశాల పురోగతిని స్వయంగా సమీక్షిస్తూ, ఢిల్లీలో కేంద్ర ఆరోగ్య శాఖ, ఎన్ఎంసి ఉన్నతాధికారులతో పలుమార్లు సంప్రదించి రాష్ట్ర ప్రతిపాదనలకు ఆమోదం వచ్చేలా మంత్రి సమన్వయం చేశారు. అధికారులు గుర్తించిన లోపాలను వెంటనే సరిచేసేలా ప్రత్యేక దృష్టి సారించడంతో వరుసగా ఫలితాలు వస్తున్నాయి. అత్యంత కీలకమైన పిడుగురాళ్ల ప్రభుత్వ వైద్య కళాశాల విషయంలో సాంకేతిక అంశాలు అడ్డంకిగా మారిన సమయంలో మంత్రి స్వయంగా వ్యవహారాన్ని పర్యవేక్షించారు. అవసరమైన మౌలిక సదుపాయాలు, అధ్యాపకులు, పరికరాల కల్పనను వేగవంతం చేయడంతో ఎన్ఎంసి 100 ఎంబీబీఎస్ సీట్లతో అనుమతి మంజూరు చేసింది. దీంతో ఈ విద్యా సంవత్సరంలోనే అక్కడ తొలి బ్యాచ్ విద్యార్థులు అడుగుపెట్టనున్నారు.కూటమి ప్రభుత్వ హయంలో రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలల్లో అదనంగా భారీ స్థాయిలో 505 ఎంబిబియస్ ప్రవేశాలకు అవకాశం లభించడంపై మంత్రి సంతోషాన్ని వ్యక్తం చేశారు. దీని వలన పేద విద్యార్థులకు ఎంతగానో ప్రయోజనం చేకూరుతుందన్నారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
మంగళవారం 14 జులై 2026

# ఏ ఎస్ డి డి జాబితాను నిశితంగా పరిశీలించాలి.

**..బీఎల్ఓలు పోలింగ్ కేంద్రాల్లోనే అందుబాటులో ఉండి పనులు వేగవంతం చేయాలి.**

**..ఆన్లైన్ ఎన్యుమరేషన్ ఫార్మ్స్ డిజిటైజేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయండి.**

**..ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు పోలింగ్ స్టేషన్లను తనిఖీ చేయాలి.**

**..జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి.**



**ఆంధ్ర ప్రగతి కర్నూలు, జూలై 13:**
ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ – ఎస్ ఐ ఆర్) ప్రక్రియలో భాగంగా ఏ ఎస్ డి డి జాబితాను నిశితంగా పరిశీలించాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, సంబంధిత అధికారులను ఆదేశించారు.
సోమవారం ఉదయం కలెక్టర్ ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, అడిషనల్ ఏఈఆర్ఓలతో టెలికాన్ఫరెన్స్ ద్వారా సర్ ప్రక్రియ పురోగతిపై సమీక్ష నిర్వహించి, దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సర్ ప్రక్రియకు సంబంధించి నమోదుకు కేవలం రెండు రోజులు మాత్రమే సమయం ఉన్నందున, బీఎల్ఓలు తమకు కేటాయించిన పోలింగ్ స్టేషన్లలోనే అందుబాటులో ఉండాలని ఆదేశించారు. మిగిలిపోయిన ఓటర్లు, బి ఎల్ ఏ లు అక్కడికే వచ్చి వివరాలు సమర్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు..మరణించిన (డెత్), డూప్లికేట్ ఓటర్లకు సంబంధించి తగిన ఆధారాలు/సర్టిఫికెట్లు / ధృవీకరణ పత్రాలు ఉన్నాయో లేదో పరిశీలించుకోవాలని, ఆబ్సెంట్, షిఫ్టెడ్ ఓటర్ల వివరాల సేకరణను నిశితంగా పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. ఏఎస్డిడి ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉన్న పోలింగ్ కేంద్రాలను ఈఆర్ఓలు స్వయంగా సందర్శించి, రాండమ్గా తనిఖీ చేయాలని, పని నాణ్యతను పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. నియోజకవర్గాల్లోని వీఐపీల ఎన్యూమరేషన్ ఫారాలను సేకరించి, వాటిని క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. అన్కలెక్టబుల్, పెండింగ్లో ఎన్యూమరేషన్ ఫారాల డేటాను త్వరగా డిజిటైజ్ చేసి, సిస్టమ్లోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. కర్నూలు, పాణ్యం, ఆదోని, ఎమ్మిగనూరు నియోజకవర్గాల్లో అన్కలెక్టబుల్ పర్సంటేజీ ఎక్కువగా ఉన్నందున, అక్కడ ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ఆన్లైన్ ఎన్యూమరేషన్ ఫారాలు పాణ్యంలో 111, ఆదోని 59, ఎమ్మిగనూరు 47, కర్నూలు 41, మంత్రాలయం 35, కోడుమూరు 22, పత్తికొండలో 2 పెండింగ్ ఉన్నాయని తెలిపారు. వీటితో పాటు జిల్లాలో పెండింగ్ ఉన్న 229 'బుక్ ఏ కాల్' రిక్వెస్ట్లను ఈరోజు సాయంత్రానికి ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని క్లియర్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈరోజు రాత్రి కల్లా అన్ని పోలింగ్ స్టేషన్లలో ఆన్లైన్ ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్కు సంబంధించిన మిగిలిన పనిని వంద శాతం పూర్తి చేసేందుకు అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ నిర్దేశించారు.
ఈఆర్వోలు, ఏ ఈ ఆర్ వో లు, ఎస్డీడిడి శాతం ఎక్కువగా ఉన్న అడిషనల్ ఏ ఈ ఆర్ వో లతో కలెక్టర్ మాట్లాడారు. టెలికాన్ఫరెన్స్లో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, కర్నూలు ఈ ఆర్వో, మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు, ఆదోని, ఎమ్మిగనూరు ఈఆర్ఓ మధుసూదన్ రెడ్డి, కోడుమూరు ఈఆర్వో సందీప్ కుమార్, పత్తికొండ ఈఆర్ఓ ఓబులేసు, మంత్రాలయం ఈఆర్ఓ అనురాధ, ఆలూరు వీఆర్వో రామసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గీకరణ పేరుతో బిజెపి రాజకీయ కుట్ర..!

**..వర్గీకరణకు వ్యతిరేకంగా పార్లమెంట్లో చట్టం చేసేంతవరకు నిరంతరం శాంతియుత పోరాటం**

**..మోడీ సాబ్... ఎస్సీ వర్గీకరణ వల్ల కేవలం రెండు శాతం ప్రజలకే మేలు.**

**దళితులపై కుట్ర చేస్తే ఖబర్దార్...! -మాల మహానాడు జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఆర్ఎస్ రత్నాకర్**





**ఆంధ్ర ప్రగతి నంద్యాల జులై 13:**
భారతదేశంలో ఎస్సీ వర్గీకరణ పేరుతో కేంద్ర ప్రభుత్వం బిజెపి రాజకీయ కుట్ర చేస్తుందని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు డాక్టర్ రత్నాకర్ అన్నారు. సోమవారం నంద్యాల పట్టణంలోని సూరత్ గ్రాండ్ హోటల్ లో మాల మహానాడు జిల్లా స్థాయి నాయకులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రత్నాకర్ మాట్లాడుతూ..ఎస్సీ వర్గీకరణను శాంపుల్ గా పంజాబ్ హర్యానాలో మొట్టమొదటిగా ఈ దేశంలో చేసింది కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమే, వర్గీకరణ కు బీజం కాంగ్రెస్ పార్టీ వేస్తే దీన్ని దేశం మొత్తం చేశాడు మన మోడీ సాబ్, నిజానికి ఎస్సీ రిజర్వేషన్ వల్ల వందలో 1-2 కి బెనిఫిట్ జరుగుతోంది, ఇది కూడా అధికారిక లెక్క కాదు,ఈ వందలో యిద్దరికిచ్చే ఈ ఫలాలను, సమన్యాయం, సామాజిక న్యాయం పేరుతో దేశవ్యాప్తంగా ఎస్సీ లిస్టులో ఉన్న 1108 ఎస్సీ కులాలకు ఎలా పంచుతారు మోడీ గారు? అలాగే ఈ రెండు సీట్లను తెలుగు రాష్ట్రాల్లో 59 ఎస్సీ కులాలకు చంద్రబాబు, రేవంత్ రెడ్డి ఎలా పంచుతారు? ఇది దళితుల ఐక్యతపై కుట్ర కాదా అని ప్రశ్నిస్తూ ఉన్నాను, మాల వర్గం పై కుట్ర చేస్తుంటే , ఎస్సీ వర్గీకరణ చట్టాలు అయిపోయినవి కదా, ఇక చేసేదేముందని అనుకోకండి మిత్రులారా, ప్రజల తలుచుకుంటే ఏ చట్టాలైన ప్రభుత్వాలు ప్రజాస్వామ్యంలో వెనక్కి తీసుకోవాల్సిందే, తెలుగు రాష్ట్రాల్లో అన్ని రాజకీయ పార్టీలు మాల సామాజిక వర్గాన్ని టార్గెట్ చేసి తొక్కేస్తా ఉంటే మాల ప్రజా ప్రతినిధులు నోరు మెదపకపోవడం, ఘోరం అన్యాయం, చెంచా గిరికి అలవాటు పడ్డ మాల నాయకులు రాజకీయ పార్టీలకు విశ్వాసంగా ఉన్నారే తప్ప జాతి పట్ల విశ్వాసంగా లేరన్న విషయాన్ని ప్రతి ఒక్కరు గమనించాలి, రిజర్వేషన్ల బెనిఫిట్ పొందిన మాల ఉద్యోగుల రా మాల జాతిని తొక్కేస్తా ఉన్నారు. ఇకనైనా కళ్ళు తెరిచి బయటకు రండి మా ఈ పోరాటానికి మద్దతు ఇవ్వండి, తెలుగు రాష్ట్రాల్లో ఏ నాడు ఎదుర్కొనటువంటి గడ్డు పరిస్థితిని మాల సామాజిక వర్గం ఈరోజు ఎదుర్కొంటూ ఉంది, పూర్తిగా తెలుగు రాష్ట్రాల్లో మన కులం తన ఉనికిని కోల్పోఇంది , శాంతియుత పోరాటానికి సిద్ధం కండి మిత్రులారా
ఈ కార్యక్రమంలో కొప్పెరా చిన చెన్నయ్య , దాసరి చిన్న లింగామయ్య, శ్రీరాముల చంద్రశేఖర్, గుణ్ణంపాడు శ్రీకాంత్, లక్క కేశవ, శ్రీరాములు సురేష్ గుద్దిటగిరి, కడారి గిరీష్ కుమార్, బేగార్ చిన అంజి.తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యానికి తావులేకుండా చర్యలు తీసుకోవాలి.

**..అర్జీదారులతో నేరుగా మాట్లాడి సంతృప్తికరంగా సమస్యలు పరిష్కరించాలి.**

**..వాట్సాప్ గవర్నెన్స్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయండి.**

**..పీజీఆర్ఎస్లో 334, రెవెన్యూ క్లినిక్స్లో 193 అర్జీల స్వీకరణ.**

**..జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూలై 13:**
ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల మేరకు సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పీజీఆర్ఎస్ హాల్లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక అనంతరం వివిధ శాఖల పనితీరుపై జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, జిల్లా రెవెన్యూ అధికారి డి. రామునాయక్, పీజీఆర్ఎస్ నోడల్ అధికారి ఉమామహేశ్వరి, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రజల నుంచి స్వీకరించే ప్రతి అర్జీని అత్యంత ప్రాధాన్యంతో పరిశీలిస్తోందని తెలిపారు. అర్జీల పరిష్కారంపై అర్జీదారుల సంతృప్తి స్థాయిని ముఖ్యమంత్రి కార్యాలయం నేరుగా సమీక్షిస్తోందని పేర్కొన్నారు. అధికారులు కేవలం నివేదికలు సమర్పించడమే కాకుండా, అర్జీదారులను వ్యక్తిగతంగా కలిసి సమస్యను వివరించి పరిష్కరించే విధంగా వ్యవహరించాలని సూచించారు. దీనివల్ల ప్రజల్లో ప్రభుత్వంపై విశ్వాసం మరింత పెరుగుతుందన్నారు. నంద్యాల రూరల్ తహశీల్దార్ పరిధిలో ఇనాం భూమిని పట్టా భూమిగా మార్చి అర్జీదారుడి సమస్యను పరిష్కరించడం ప్రశంసనీయమని కలెక్టర్ పేర్కొన్నారు. మరోవైపు జూపాడుబంగ్లా మండలంలో ఒక అర్జీకి సంబంధించి తప్పు సమాచారం అందించిన ఘటనను ప్రస్తావిస్తూ, ఇలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆదేశించారు. అలాగే నంద్యాల మున్సిపాలిటీ పరిధిలో ఇంటి పన్నుకు సంబంధించి వచ్చిన ఫిర్యాదుపై కమిషనర్ స్వయంగా అర్జీదారుని కలిసి వివరణ ఇవ్వడంతో ఆయన సంతృప్తి వ్యక్తం చేసిన విషయాన్ని ఉదాహరణగా పేర్కొన్నారు. అర్జీదారులకు అందించే పరిష్కార నివేదికలపై సంబంధిత అధికారులు తప్పనిసరిగా సంతకం చేయాలని కూడా కలెక్టర్ స్పష్టం చేశారు.

**వాట్సాప్ గవర్నెన్స్ సేవలను మరింత విస్తృతంగా వినియోగించాలి.**

ప్రభుత్వ సేవలను ప్రజలకు ఇంటి వద్ద నుంచే అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో వాట్సాప్ గవర్నెన్స్ వ్యవస్థను ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం సుమారు 1,500 ప్రభుత్వ సేవలు వాట్సాప్ ద్వారా అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డులకు వచ్చే ప్రతి పౌరునికి ఈ సేవలపై అవగాహన కల్పించి, కార్యాలయాలకు రాకుండానే ఇంటి నుంచే ప్రభుత్వ సేవలు పొందేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

**రెవెన్యూ క్లినిక్స్ ద్వారా 193 అర్జీల స్వీకరణ**

భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన రెవెన్యూ క్లినిక్స్ ప్రజలకు సమర్థవంతమైన వేదికగా నిలుస్తున్నాయని కలెక్టర్ తెలిపారు. ఈ క్లినిక్స్ ద్వారా భూ సంబంధిత సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే అవకాశం కలుగుతోందన్నారు. రెవెన్యూ క్లినిక్స్లో మొత్తం 193 అర్జీలు స్వీకరించగా, వాటిలో రెవెన్యూ, గ్రామ/వార్డు సచివాలయ సేవలకు సంబంధించినవి 3, చుక్కల భూముల క్రమబద్ధీకరణ, 22-ఎ భూములకు సంబంధించినవి 4, అసైన్డ్ భూములు, భూ ఆక్రమణలకు సంబంధించినవి 39, రెవెన్యూ కోర్టు విచారణలు, ఆర్ఓఆర్కు సంబంధించినవి 73, సర్వే, రీ-సర్వే అంశాలకు సంబంధించినవి 61, దేవాదాయ, వక్ఫ్ భూములకు సంబంధించినవి 13 అర్జీలు ఉన్నట్లు కలెక్టర్ వివరించారు. 1)జూపాడుబంగ్లా మండలం మండ్లెం గ్రామానికి చెందిన రాజా గౌడు, సర్వే నంబరు 542/బిలో ఉన్న 2.52 ఎకరాల భూమి చుక్కల భూమిగా నమోదైందని, దానిని పట్టా భూమిగా మార్చాలని కోరుతూ జిల్లా కలెక్టర్కు వినతిపత్రం సమర్పించారు.
2)ఆళ్లగడ్డ మండలం బాచాపురం గ్రామానికి చెందిన అన్నెం కాశీ విశ్వనాథరెడ్డి, జి. జంబులదిన్నె గ్రామంలోని సర్వే నంబరు 300/2లో తనకు ఉన్న 3.60 ఎకరాల భూమికి రహదారి సౌకర్యం కల్పించాలని కోరుతూ అర్జీ అందజేశారు. 3)కొత్తపల్లి మండలం దుద్యాల గ్రామానికి చెందిన ఎం. దిబ్బన్న, సర్వే నంబరు 1172లోని తన భూమిని ఇతరులు ఆన్లైన్లో నమోదు చేసుకున్నారని, దీనిపై విచారణ జరిపి న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్కు వినతిపత్రం సమర్పించారు.

# శాస్త్ర యుక్తంగా సహస్రఘట్టాభిషేకం.






**ఆంధ్ర ప్రగతి మహానంది జూలై 13:** మండలంలోని బొల్లవరం గ్రామం నందు వెలసిన శివాలయంలో శాస్త్ర యుక్తంగా సహస్రఘట్టాభిషేక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు అనంతరం సహస్ర ఘట్టాభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రత్యేక పూజా కార్యక్రమాల కంటే ముందు గ్రామంలో వెలసిన అన్ని ఆలయాల్లో కొబ్బరికాయలు సమర్పించారు. డప్పులతో గ్రామస్తులు గ్రామం వెలపల ఉన్న కేసీ కెనాల్ వద్ద గంగమ్మకు పూజలు నిర్వహించి కాలువలో నీరు లేకపోవడంతో సమీపంలోని బావి నుండి నీటిని బిందెల ద్వారా తీసుకొని వచ్చి సహస్ర ఘట్టాభిషేకంలో పాలుపంచుకున్నారు. శాస్త్ర యుక్తంగా వేద మంత్రోచ్చారణల మధ్య సహస్ర ఘట్టాభిషేక కార్యక్రమం పండితులు నిర్వహించారు. సహస్ర ఘట్టాభిషేక కార్యక్రమంలో తర తమ బేధం లేకుండా స్త్రీ, పురుషులు పాల్గొనడం విశేషం. లోక కళ్యాణార్థం ఈ కార్యక్రమాన్ని చేపట్టామని గ్రామస్తులు తెలిపారు. సకాలంలో వర్షాలు లేకపోవడంతో రైతులతోపాటు అందరూ ఇబ్బంది పడుతున్నారు అని వర్షం పడితే పాడి పంటలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. మా గ్రామంలో వెలసిన శివాలయంలో శివునికి సహస్ర గట్టాభిషేక కార్యక్రమం నిర్వహిస్తే వర్షం కురుస్తుందని అనాదిగా వస్తున్న ఆచార ప్రకారం ఈ కార్యక్రమాన్ని చేపట్టామని గ్రామస్తులు పేర్కొన్నారు. ఇందుకు గాను ఆలయ ఈవో స్వర్ణముఖి పూర్తి సహాయ సహకారాలు అందించారని దీంతోపాటు గ్రామస్తులు కూడా చందాలు వేసుకుని సహస్ర ఘట్టాభిషేక కార్యక్రమాన్ని దిగ్విజయంగా అందరి సహకారంతో నిర్వహించామన్నారు.

# ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరాన్ని ప్రారంభించిన రాష్ట్ర మంత్రిఎన్ఎండి ఫరూక్.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల జులై 13:**
నంద్యాల మున్సిపల్ టౌన్ హాల్ లో నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ఆధ్వర్యంలోని ఉచిత క్యాన్సర్ వైద్య పరీక్షల మహా శిబిరంను రాష్ట్ర న్యాయశాఖ, మైనారటి సంక్షేమ శాఖ మంత్రి ఎన్ ఎం డి ఫరూక్ సోమవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి ఎన్ ఎం డి ఫరూక్ మాట్లాడుతూ హైదరాబాద్ లోని బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ చైర్మన్, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సహకారంతో ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ప్రత్యేక చొరవతో ఈ ఉచిత క్యాన్సర్ శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.
సుమారు రూ. 15,000 విలువైన క్యాన్సర్ పరీక్షలను ప్రజలకు ఉచితంగా అందిస్తున్నారని, ముందస్తు పరీక్షలతో క్యాన్సర్ను జయిద్దాం అనే నినాదంతో, క్యాన్సర్ను ప్రాథమిక దశలోనే గుర్తించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలనే లక్ష్యంతో ఈ శిబిరాన్ని నిర్వహించారన్నారు. .30 ఏళ్ల పైబడిన మహిళలు, చెడు అలవాట్లు ఉన్నవారు. కుటుంబంలో క్యాన్సర్ చరిత్ర ఉన్నవారు, అనుమానాస్పద లక్షణాలు ఉన్నవారు ఈ సంచార క్యాన్సర్ స్క్రీనింగ్ వాహన సదుపాయాన్ని వినియోగించుకోవాలని మంత్రి ఫరూక్ కోరారు. క్యాన్సర్ను ప్రారంభ దశలోనే గుర్తిస్తే చికిత్స సులభతరమవుతుందని, నయం అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నంద్యాల మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, సెంట్రల్ ఫుడ్ కమిషన్ నెంబర్ నరహరి విశ్వనాథ్ రెడ్డి , రాయలసీమ విద్యార్థి సంఘం వ్యవస్థాపకులు సీమ కృష్ణ , యం. వి.రమణారెడ్డి, వసుంధర దేవి, పలువురు ప్రజా ప్రతినిధులు, వైద్యులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు

# అమరావతి ఛాంపియన్స్ కప్-2026 పోస్టర్లను విడుదల చేసిన మంత్రి ఎన్ఎండి ఫరూక్.




**ఆంధ్ర ప్రగతి నంద్యాల జులై 13:**క్రీడల అభివృద్ధికి మరియు రాష్ట్రంలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అమరావతి ఛాంపియన్స్ కప్ 2026 పోస్టర్లను నంద్యాలలోని తన క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ సోమవారం విడుదల చేశారు.ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ రాష్ట్రంలోని యువతకు క్రీడల పట్ల ఆసక్తిని పెంచేందుకు మరియు ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలికితీసేందుకు ఈ ఛాంపియన్స్ కప్ ఎంతో దోహదపడుతుందని తెలిపారు. నియోజకవర్గ, జిల్లా మరియు రాష్ట్ర స్థాయిలలో మొత్తం 12 రకాల క్రీడలలో ఈ పోటీలు జరగనున్నాయని తెలిపారు. అథ్లెటిక్స్, ఆర్చరీ, బ్యాడ్మింటన్, బాస్కెట్బాల్, చెస్, హాకీ, కబడ్డీ, ఖో-ఖో, వెయిట్ లిఫ్టింగ్, వాలీబాల్, యోగా మరియు బాక్సింగ్ (మొత్తం 12). అండర్-17 మరియు అండర్-23 (బాలురు మరియు బాలికలు) జూలై 15 నుండి ఆగస్టు 26, 2026 వరకు జరుగుతాయని తెలిపారు మొత్తం బహుమతిగా రూ. 91,90,000/- (పోటీలలో విజేతగా నిలిచిన అందరికీ కలిపి) ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిఎస్డిఓ రాజు, ఫినిషింగ్ కోచ్ లక్ష్మణ్, హాకీ కోచ్ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు

## రూ.50 లక్షల డ్రైనేజీ పనులకు మంత్రి ఫరూక్ శంకుస్థాపన.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూలై 13 :**
నంద్యాల పట్టణంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. పట్టణంలోని పలు ప్రాంతాల్లో రూ.50 లక్షల వ్యయంతో చేపట్టనున్న నూతన డ్రైనేజీ నిర్మాణ పనులకు రాష్ట్ర న్యాయశాఖ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ సోమవారం భూమి పూజ నిర్వహించి పనులకు శ్రీకారం చుట్టారు. పట్టణ ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య వసతులు కల్పించడం, వర్షాకాలంలో నీటి నిల్వలు, మురుగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి ఫరూక్ తెలిపారు. నంద్యాల మొదటి వార్డులోని పీవీ నగర్ స్వర్గదామం సమీపంతో పాటు 21వ వార్డులో నూతన డ్రైనేజీల నిర్మాణానికి సుమారు రూ.50 లక్షల నిధులు మంజూరైనట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పట్టణాభివృద్ధికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ, పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు డ్రైనేజీ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నామని చెప్పారు. పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండీ ఫయాజ్, నంద్యాల మున్సిపల్ కమిషనర్ బి. శేషన్న, మున్సిపల్ ఇంజనీర్ నాగభూషణం రెడ్డి, మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు విక్రమ్, శభరిష్, శానిటేషన్ సూపర్‌వైజర్లు లక్ష్మీనారాయణ, శివప్రసాద్ రెడ్డి, మధుసూదన్, పిచికె సుమలత, పబ్బతి వేణు, గురుప్రసాద్, స్థానిక ప్రజాప్రతినిధులు, నంద్యాల నవ నిర్మాణ సమితి ప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ఆడిట్ అధికారుల నిర్లక్ష్యం...

## మున్సిపల్ కాంట్రాక్టర్లకు ఇబ్బందులు.

**..2 కోట్ల బిల్లులు ఎక్కించని అడిట్ అధికారులు....నెలరోజులుగా అడిట్ అధికారులు ఏమిచేస్తున్నారు.**

**..5శాతం లంచం ఇవ్వకపోతే బిల్లులు ఎక్కించరా. ... రేపు అడిట్ కార్యాలయం వద్ద ధర్నాకు సిద్ధమైన కాంట్రాక్టర్లు.**




**ఆంధ్ర ప్రగతి నంద్యాల జులై 13:**
కూటమి ప్రభుత్వం మున్సిపాలిటీలో పనిచేసిన కాంట్రాక్టర్లకు పని అయిపోయిన వెంటనే బిల్లులు ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చింది. ప్రభుత్వ ఆదేశాలను అడిట్ అధికారులు తుంగలో తొక్కుతున్నారు. అడిట్ అధికారులు నిర్లక్ష్యంతో మున్సిపల్ కాంట్రాక్టర్లు ఇబ్బందులు పడుతున్నారు. అడిట్ అధికారులు నిర్లక్ష్యానికి రేపు మున్సిపల్ కాంట్రాక్టర్లు అందరూ అడిట్ కార్యాలయం వద్ద ధర్నాకు సిద్ధం అవుతున్నారు. నెలరోజులుగా వర్క్ బిల్లులు,సి.బిల్లులు ఎక్కించకుండా ఉండటానికి కారణం వారు ఆశించిన లంచం ఇవ్వకపోవడమే కారణమనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వివరాల్లోకి వెళితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధిపై దృష్టిపెట్టింది. కార్పొరేషన్,మున్సిపాలిటీలు అభివృద్ధి చెందాలంటే కాంట్రాక్టర్లకు పనులు చేసిన వెంటనే బిల్లులు ఇస్తే అభివృద్ధి జరుగుతుందని గ్రహించారు. ప్రభుత్వం వెంటనే ప్రతి నెల 11 నుంచి 20 వ తేదీ లోపల పనులు చేసిన వారి బిల్లులు అదే నెల చివరిరోజుల్లో బిల్లులు ఇచ్చేవిధంగా ఆదేశాలు ఇచ్చింది .మున్సిపల్ కాంట్రాక్టర్లు కోట్లాది రూపాయల పాత బకాయిలు ఉన్న కొత్త పనులు చేస్తే వెంటనే బిల్లులు వస్తున్నాయని కొందరు కాంట్రాక్టర్లు పనులు చేశారు. గత నెల నుంచి వర్క్ బిల్లులు,సి.బిల్లులు దాదాపు 2 కోట్ల బిల్లులు అడిట్ అధికారులు ఎక్కించకపోవడంతో కాంట్రాక్టర్లకు డబ్బులు రాలేదు. నాణ్యానికి ఒక వైపు అనుకున్న వారికి రెండవ వైపు చూస్తే గతంలో బిల్లులు ఒకే చేయడానికి 3 శాతం లంచం ఇస్తే కానీ బిల్లులు ఒకే అయ్యేవి కావు అన్నది నగ్నసత్యం. గతంలో కూడా మున్సిపల్ కాంట్రాక్టర్ల బిల్లులు ఎక్కించకపోవడంతో అడిట్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించడంతో ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించారు. ఈ నేపథ్యంలోనే కొందరు కాంట్రాక్టర్లు అడిట్ కార్యాలయం వద్ద కు వెళ్లి ప్రశ్నిస్తే అధికారులు కొత్తగా వచ్చారని కుంటి సాకులు చెపుతున్నారని ఆరోపిస్తున్నారు. అడిట్ కార్యాలయంలో పనిచేసేవారికి కొత్తా,పాత అని ఉంటుందా అని ప్రశ్నిస్తున్నారు. అడిట్ అధికారులు మున్సిపల్ అధికారుల జీతాలు మాత్రం ఎక్కించి,కాంట్రాక్టర్ల బిల్లులు ఎక్కించకపోవడం మతలబ్ అందరికీ తెలిసిన విషయమే. వాస్తవానికి మున్సిపల్ కాంట్రాక్టర్లు వారు చేసిన పనికి బిల్లులు ఎక్కించాలంటే 3 శాతం లంచం ఇచ్చేవారు,కొత్త వారు వచ్చారు కదా వారు 5 శాతం లంచం అడగడం,కాంట్రాక్టర్లు ఇవ్వకపోవడం వల్లే బిల్లులు ఎక్కించలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రతి సారి అడిట్ అధికారులు వల్ల తీవ్రంగా నష్టపోతున్నాం అందుకే రేపు ఉదయం 12 గంటలకు అడిట్ కార్యాలయం వద్ద ధర్నా చేసేందుకు సిద్ధం అవుతున్నట్టు తెలుస్తోంది. మున్సిపల్ అధికారులకు జీతాలపై ఉన్న శ్రద్ధ కోట్లు పెట్టుబడి పెట్టీ అభివృద్ధి పనులు చేస్తున్న కాంట్రాక్టర్ల బిల్లులు వచ్చే విధంగా చూడకపోవడం విశేషం. అభివృద్ధి జరిగినా జరగకపోయినా మా జీతాలు వస్తె చాలు అనుకుంటున్న మున్సిపల్ అధికారులు. గత నెలతో పాటు ఈ నెలకూడా బిల్లులు వేస్తే లేదో అని కాంట్రాక్టర్లు ఆవేదన చెందుతున్నారు. మున్సిపల్ కాంట్రాక్టర్లకు న్యాయం జరుగుతుందని ఆశిద్దాం.

## జూలై 16న తుంగభద్ర ప్రాజెక్టు నుండి 1.5 టీఎంసీల నీరు విడుదల.!

**..జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి.**

**..త్రాగునీటి అవసరాలకే తొలి ప్రాధాన్యత నీటి చౌర్యాన్ని అడ్డుకోవాలని అధికారులకు ఆదేశం.**

**..రైతులు స్వచ్ఛందంగా పంట బీమా ప్రీమియంలు చెల్లించి, ఆర్థిక రక్షణ పొందాలి.**

**..రైతులు నష్టపోకుండా చూడటమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశం.**




**ఆంధ్ర ప్రగతి కర్నూలు, జూలై 13:**
జూలై 16న తుంగభద్ర ప్రాజెక్టు నుండి 1.5 టీఎంసీల నీరు విడుదలవుతోందని, ఈ నీరు 123 కిలోమీటర్లు ప్రవహించి జిల్లాకు చేరేందుకు ఐదు రోజులు పట్టనుందని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి తెలియజేశారు. సోమవారం కలెక్టరేట్ నుండి సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించి, ఆదేశాలు జారీ చేశారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తుంగభద్ర నుండి విడుదలైన నీటితో ఎస్ఎస్ ట్యాంకులను నింపడానికి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ప్రజల దాహార్తిని తీర్చడమే మొదటి ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. ట్యాంకుల నుండి నేరుగా నీటిని తీసుకోవడానికి ప్రయత్నిస్తే కుదరదని హెచ్చరించారు. ఈ ఏడాది ఎల్నినో ప్రభావంతో వర్షాలు అతి తక్కువగా కురిసినందున పంటలకు నీరు అందించే పరిస్థితి లేదన్నారు. జూలై 16 తరువాత నీటి సరఫరా ప్రారంభం కానున్న నేపథ్యంలో.. తహశీల్దార్లు, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్.ఇ, మరియు పోలీస్ అధికారులు సమన్వయంతో వ్యవహరించి నీటి చౌర్యాన్ని అడ్డుకోవాలని ఆదేశించారు. అనావృష్టి కారణంగా ఈసారి పంట దిగుబడి వచ్చే అవకాశాలు తక్కువగా ఉన్నందున, రైతులు నష్టపోకుండా ఉండేందుకు పంట బీమా చక్కని అవకాశమని కలెక్టర్ తెలిపారు. జూలై 15 పత్తి, వేరుశనగ పంటల బీమా ప్రీమియం చెల్లింపునకు ఆఖరి తేదీ అని తెలియజేశారు. అధికారులు రైతులను చైతన్యపరిచి స్వచ్ఛందంగా పంట బీమా ప్రీమియం చెల్లించేలా చూడాలన్నారు. ముఖ్యంగా ఆస్పరి, క్రిష్ణగిరి, ఆలూరు ప్రాంతాల్లో నాన్-లోనీ రైతులు ఎక్కువగా ఉన్నందున, ఆయా ప్రాంతాలపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులు, వీఆర్ఓలు, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, రైతు భరోసా కేంద్రాల సిబ్బంది మరియు బ్యాంకర్లు క్షేత్రస్థాయిలో రైతులకు పూర్తి అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే పశువుల పెంపకందారులకు కూడా బీమా వర్తించేలా పశుసంవర్ధక శాఖ అధికారులతో చర్చించామని, రైతులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, స్వచ్ఛందంగా పంట బీమా ప్రీమియంలు చెల్లించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ టెలీ కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి, ఎల్ డి ఎం పి. మోహన్, తదితరులు పాల్గొన్నారు.

## నంద్యాలలో ఘనంగా గంగమ్మకు బోనాలు సమర్పించిన రజకులు.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూలై 13:** నంద్యాలపట్టణంలోని కుందూ నది ఒడ్డున వెలసిన శ్రీ శ్రీ గంగమ్మ తల్లికి భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. ఆదివారం జరిగిన ఈ బోనాల ఉత్సవంలో దాదాపు 200 కుటుంబాలు పాల్గొని బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా రజక సంఘం నాయకులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా గంగమ్మ తల్లికి బోనాలు సమర్పించడం ఆనవాయితీగా ఉందన్నారు రాష్ట్రంలో వర్షాలు బాగా కురిసి ఒకపక్క రైతులు మరోపక్క రజకులు సంతోషంగా ఉండాలని గంగమ్మ తల్లికి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గంగమ్మ గుడి ఆలయ ప్రెసిడెంట్ వై నాగభూషణం వైస్ ప్రెసిడెంట్ లింగమూర్తి దాసగిరి నాగరాజు ట్రెజరర్ టి శ్రీనివాసులు సెక్రెటరీ దాసగిరి మునయ్య కమిటీ మెంబర్లు శ్రీనివాసులు ఎన్ సంజప్ప డి రామకృష్ణ వై నాగలింగరాజు గొందిపల్లి శ్రీనివాసులు భారత్ మటన్ చికెన్ సెంటర్ శ్రీనివాసులు రాయలసీమ ప్రతిభ ఎడిటర్ బొల్లవరం శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# చదరంగం పోటీల్లో శ్రీ శాంతినికేతన్ పాఠశాల విద్యార్థుల ప్రభంజనం



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జులై 13:**
నంద్యాల జిల్లా చెస్ అసోసియేషన్, ఆంధ్ర చెస్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నంద్యాలలోని శ్రీ రామకృష్ణ డిగ్రీ కాలేజ్ వేదికగా నిర్వహించిన "నంద్యాల జిల్లా సీనియర్స్ చెస్ సెలక్షన్స్ ఫర్ స్టేట్ లెవెల్ - 2026" పోటీలలో క్రాంతినగర్‌లోని శ్రీ శాంతినికేతన్ పాఠశాల విద్యార్థులు అసాధారణ ప్రతిభ కనబరిచి పతకాల పంట పండించారు. వివిధ విభాగాల్లో పోటీపడిన ఈ విద్యార్థులు టాప్ ర్యాంకులు సాధించడమే కాకుండా, రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించి పాఠశాల కీర్తిని దశదిశలా చాటారు.

### విజేతల వివరాలు:

**అండర్-15 విభాగం.**

ఎస్. శిరీష్ కుమార్ (8వ తరగతి – సి.బి.ఎస్.ఈ): ఈ విభాగంలో అద్భుతమైన ఆటతీరును ప్రదర్శించి మొదటి

**రాష్ట్ర స్థాయికి ముగ్గురు ఎంపిక.**

స్థానం (ఫస్ట్ ర్యాంక్) కైవసం చేసుకుని, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు.

ఎ. జయ్ చౌడేశ్వరి సంతోష్ (9వ తరగతి – స్టేట్ బోర్డ్): గట్టి పోటీనిస్తూ ద్వితీయ స్థానం (సెకండ్ ర్యాంక్) సాధించి, రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించాడు. సి. పవన్ కుమార్ రెడ్డి (9వ తరగతి – స్టేట్ బోర్డ్): అత్యుత్తమ ప్రతిభను కనబరిచి నాల్గవ స్థానం (ఫోర్త్ ర్యాంక్) సాధించి మెడల్ గెలుచుకున్నాడు.

**అండర్-13 విభాగం.**

కె. యజ్ఞచరణ్ (9వ తరగతి – స్టేట్ బోర్డ్): ఈ విభాగంలో అద్భుతంగా రాణించి తృతీయ స్థానం (థర్డ్ ర్యాంక్) దక్కించుకుని, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు.

కె. ఓబ్లేష్ (8వ తరగతి – సి.బి.ఎస్.ఈ): చక్కటి ప్రతిభ కనబరిచి ఐదవ స్థానం (ఫిఫ్త్ ర్యాంక్) సాధించి మెడల్ సొంతం చేసుకున్నాడు.

**చైర్మన్ అభినందనలు:**

విద్యార్థుల ఈ అద్భుత విజయానికి గానూ శ్రీ శాంతినికేతన్ విద్యాసంస్థల చైర్మన్ శ్రీ ఎస్. సుధాకర్ విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఇంతటి ఘనవిజయానికి కారకులైన పాఠశాల చెస్ కోచింగ్ స్టాఫ్, నిపుణులు మరియు పీఈటీ బృందాన్ని ఆయన అభినందిస్తూ, రాబోయే రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా మన విద్యార్థులు విజయం సాధించి జిల్లాకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని విజేతలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## మంత్రి ఎన్ఎండి ఫరూక్ ని మర్యాదపూర్వకంగా కలిసిన నంద్యాల నూతన ట్రాఫిక్ సీఐ.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జులై 13:**
నంద్యాల నూతన ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆర్.జే. సుబ్రహ్మణ్యం ఈరోజు నంద్యాలలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ ని మర్యాదపూర్వకంగా కలిశారు.
ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ట్రాఫిక్ సీఐ సుబ్రహ్మణ్యం ని మంత్రి ఫరూక్ అభినందించారు. నంద్యాల పట్టణంలో ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించడంలో మరియు వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా మెరుగైన ట్రాఫిక్ వ్యవస్థను అమలు చేయడంలో సుబ్రహ్మణ్యం సమర్థవంతంగా పనిచేయాలని తెలిపారు.

## నంద్యాలలో దివ్యాంగులకు ఉచిత హీరో మోటార్ సైకిళ్ల పంపిణీ.

**..దివ్యాంగుల సంక్షేమంలో దేశానికే ఆదర్శంగా ఆంధ్రప్రదేశ్ : మంత్రి ఎన్ఎండి ఫరూక్.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జులై 13:**
నంద్యాల పట్టణంలోని మంత్రి గారి క్యాంప్ కార్యాలయంలో దివ్యాంగుల లబ్ధిదారులకు ఉచితంగా హీరో మోటార్ సైకిళ్లను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ , టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమం, ఆత్మగౌరవం, స్వావలంబనకు కూటమి ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు నెలకు రూ.6,000 సామాజిక భద్రతా పెన్షన్, మంచానికే పరిమితమైన లబ్ధిదారులకు రూ.15,000 పెన్షన్ అందజేస్తూ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. దివ్యాంగులు, బెడ్-రిడెన్ బాధితులకు ఈ స్థాయిలో ఆర్థిక భరోసా కల్పిస్తున్న రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక గుర్తింపు పొందిందని తెలిపారు. అలాగే, పెన్షన్‌లతో పాటు ఉచిత మోటార్ సైకిళ్లు, ఉపకరణాలు, విద్య, ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాల ద్వారా దివ్యాంగులను అన్ని రంగాల్లో సాధికారత వైపు నడిపించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ప్రతి అర్హులైన లబ్ధిదారునికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు చేరేలా కట్టుబడి పనిచేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు దేవరపాటి రవికుమార్, మిద్దె ఉసేని, బాలస్వామి, ఖాజా శంకర్ , వేద సాయి, హారున్ బేగ్ తదితరులు పాల్గొన్నారు

EDITOR.PRINTED,PUBLISHED AND OWENED BY CHINNA MATHANGI SREENIVASULU AND PRINTED AT:JRD PUBLICATIONS, # 11-107, ABBAS NAGAR, DISTRICT- KURNOOL,ANDHRA PRADESH- 518002
AND PUBLUSHED FROM #24-100B, HARIJANAWADA, NANDYAL, ANDHRA PRADESH- 518501 RNI : APTEL/2023/89112, PHONE NO: 81211 33006, EMAIL ID : SREENIVAS.CM77@GMAIL.COM

# ఎల్‌నినో వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు రైతులు పీఎండీఎస్ ను అవలంబించాలి.

**-కర్నూలు జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.**

**..జిల్లాలో 92000 ఎకరాల్లో పీఎండిఎస్ లక్ష్యంగా నిర్దేశం.**

**..పిఎండిఎస్ తోనే ప్రధాన పంటకు రక్షణ.**



**ఆంధ్ర ప్రగతి కర్నూలు, జూలై 13:** ఎల్‌నినో వల్ల జిల్లాలో వర్షాలు చాలా తక్కువగా పడుతున్నాయని కలెక్టర్ డా.ఏ.సిరి పేర్కొన్నారు. సుమారుగా పదిహేను రోజుల నుంచి జిల్లాలో వర్షాలు ఎక్కువ పడలేదు కాబట్టి, ఎల్‌నినో ప్రభావం నుండి బయటపడాలంటే రైతులందరూ ప్రి మాన్సూన్ డ్రై సోయింగ్ (పీఎండీఎస్) చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. చిరుధాన్యాలు, పప్పు దినుసులు, నూనె గింజలు మొదలగు 36 రకాల గింజలు జీవామృతంతో శుద్ధి చేసుకుని, మట్టి, బూడిదతో కలిపి చేలల్లో చెల్లుకోవాలని రైతులకు పిలుపునిచ్చారు. పిఎండిఎస్ మిశ్రమం వర్షం పడేంత వరకు చేన్లలో అలాగే ఉంటుందని తెలిపారు. వర్షం పడినప్పుడు మిశ్రమంలోని గింజలు మొలకెత్తి, ప్రధాన పంట రక్షించబడుతుందని తెలియజేశారు. పిఎండిఎస్ వలన భూసారం పెరిగి, నీటిమట్టం రక్షించబడి, ప్రధాన పంటకు నీడ అందుతుందని వివరించారు. పిఎండిఎస్ వలన వర్షం తక్కువ పడినా, ఎక్కువ పడినా ప్రధాన పంటకు లాభంచే విధంగా ఉంటుందని స్పష్టం చేశారు. పిఎండిఎస్ వలన ప్రధాన పంటకు 15 రోజుల పాటు నీరు లేకపోయినా ఇబ్బంది లేకుండా ఉంటుందని వెల్లడించారు. ప్రధాన పంట రక్షించబడటం మాత్రమే కాకుండా, పీఎండిఎస్ లో భాగంగా చెల్లిన మిశ్రమం నుండి మొలకెత్తిన పంటను పశుగ్రాసంగా వాడుకోవచ్చని పేర్కొన్నారు. జిల్లాలో 92,000 ఎకరాల్లో పీఎండిఎస్‌ను లక్ష్యంగా నిర్దేశించామని, 86% అంటే 74,000 ఎకరాల్లో పీఎండిఎస్‌ను పూర్తి చేయగలిగామని తెలిపారు. ఇప్పటికి కురిసిన అత్యల్ప వర్షాలకే పీఎండిఎస్ బాగా మొలకెత్తాయని, పత్తి ప్రధాన, ఏకైక పంటగా సాగు చేస్తున్న రైతులందరూ పిఎండిఎస్ పద్ధతిని అవలంబించాలని సూచించారు. పిఎండిఎస్ లో అన్నీ కాకపోయినా కనీసం కొన్ని రకాల గింజలను వేసుకున్నా రైతులకు లాభదాయకంగా ఉంటుందని స్పష్టం చేశారు. జిల్లాలో మరో లక్ష ఎకరాల్లో పిఎండిఎస్, ట్యాంక్ బెడ్‌లలో పశుగ్రాసం సాగు చేయించాలని కలెక్టర్ ఇరిగేషన్, పశు సంవర్థక శాఖ అధికారులను ఆదేశించారు.



# విద్యుత్ ఉచ్చుతో అడవి జంతువుల వేట.. ఇద్దరు అరెస్ట్.



**ఆంధ్ర ప్రగతి మహానంది జులై 13:** నంద్యాల రిజర్వ్ ఫారెస్ట్ సమీపంలోని అరటి తోటలో అక్రమంగా విద్యుత్ ఉచ్చు ఏర్పాటు చేసి ఒక అడవి పిల్లి, ఒక అడవి పందిని వేటాడిన కేసులో అటవీ శాఖ అధికారులు ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. ఈ కేసులో పుట్టిపల్లె గ్రామానికి చెందిన డి. రమేష్, తిమ్మాపూర్ గ్రామానికి చెందిన డి. వెంకటేష్లను అదుపులోకి తీసుకుని, విచారణ అనంతరం న్యాయస్థానంలో హాజరుపరచగా కోర్టు రిమాండ్ విధించింది. అడవి జంతువుల వేట, విద్యుత్ ఉచ్చుల ఏర్పాటు వంటి చర్యలు చట్టవిరుద్ధమని, ఇలాంటి నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అటవీ శాఖ అధికారులు హెచ్చరించారు.

# నంద్యాల జిల్లాలో స్థానిక ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగుర వేయాలి

**-జిల్లా బీజేపీ అధ్యక్షుడు అభిరుచి మధు పిలుపు. - బనగానపల్లె, డోన్ నియోజకవర్గాల్లో ఘనంగా బీజేపీ పదాధికారుల సమావేశం.**

**-బూత్ స్థాయి నుంచే పార్టీని పటిష్టం చేయాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేసిన జిల్లా బిజెపి అధ్యక్షుడు అభిరుచి మధు.**

**-జిల్లా బీజేపీ ఇంచార్జ్ పిడి పార్థ సారధి, కో ఇంచార్జ్ కాశీ విశ్వనాధ్.**






**ఆంధ్ర ప్రగతి బనగానపల్లె/డోన్:** నంద్యాల జిల్లా రాజకీయాల్లో భారతీయ జనతా పార్టీని తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దేందుకు జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు పక్కా ప్రణాళికతో దూసుకుపోతున్నారు. ఇందులో భాగంగా సోమవారం బనగానపల్లె, డోన్ నియోజకవర్గాల్లో జిల్లా ఇంచార్జ్ పార్థ సారధి, కో ఇంచార్జ్ కాశీ విశ్వనాధ్ లతో కలిసి పదాధికారుల సమావేశాల్లో పాల్గొని పార్టీ శ్రేణుల్లో నూతనోత్తేజాన్ని నింపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీని విజయపథంలో నడిపించేందుకు తనదైన శైలిలో కార్యకర్తలకు మార్గనిర్దేశం చేశారు.

నేతలకు దిశానిర్దేశం: అందరినీ కలుపుకుంటూ.. సమావేశంలో అభిరుచి మధు మాట్లాడుతూ, "క్షేత్రస్థాయిలో పార్టీకి ఉన్న ఆదరణను ఓటు బ్యాంకుగా మార్చుకోవాల్సిన అవసరం ఉంది. కేవలం రాజకీయాలే కాకుండా, ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడే నాయకత్వం మనకు కావాలి. కేంద్ర ప్రభుత్వ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లడం ద్వారా ప్రజల్లో పార్టీపై నమ్మకాన్ని మరింత పెంచాలి," అని స్పష్టం చేశారు. పార్టీని బలోపేతం చేసేందుకు



పదాధికారులు, కార్యకర్తలు ఐక్యంగా, అంకితభావంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

అభిరుచి మధు నాయకత్వంలో జోరు

జిల్లా ఇన్‌చార్జి పి.డి. పార్థసారథి, కో-ఇన్‌చార్జి కాశీ విశ్వనాథ్ మాట్లాడుతూ, అభిరుచి మధు నాయకత్వంలో జిల్లావ్యాప్తంగా పార్టీ కార్యకలాపాలు అత్యంత వేగంగా, సమర్థవంతంగా సాగుతున్నాయని కొనియాడారు. ఆయన తీసుకుంటున్న నిర్ణయాలు, క్షేత్రస్థాయిలో పార్టీకి బలాన్ని చేకూరుస్తున్నాయని పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు అనుసరిస్తున్న వ్యూహరచనతో రానున్న రోజుల్లో బీజేపీ జిల్లాలో అద్భుతమైన ఫలితాలను సాధిస్తుందన్న





ఆశాభావాన్ని వారు వ్యక్తం చేశారు.

ఈ సమావేశాల్లో ఆయా నియోజకవర్గాల స్థాయి నాయకులు, పదాధికారులు, మండల స్థాయి బాధ్యులు మరియు భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు. అభిరుచి మధు సమక్షంలో పార్టీ భవిష్యత్తు కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించడం కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపింది.

# ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం సానుకూలం.

**ఏపీ జేఏసీ అమరావతి నంద్యాల జిల్లా కమిటీ**




**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూలై 13:** ప్రభుత్వం ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపడాన్ని స్వాగతించింది. ఈ నెల 10, 11 తేదీల్లో మంత్రుల కమిటీతో జరిగిన చర్చలు ఉద్యోగుల్లో విశ్వాసాన్ని పెంచాయని జిల్లా చైర్మన్ పి. రామచంద్రరావు తెలిపారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న ఆర్థిక, ఆర్థికేతర సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తోందని, త్వరలో ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో ఉద్యోగ సంఘాలతో జరిగే సమావేశంలో కీలక నిర్ణయాలు వెలువడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. పీఆర్సీ కమిషనర్ నియామకం, మధ్యంతర భృతి (ఐఆర్), డీఏ బకాయిల విడుదల, సీపీఎస్ రద్దు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాల పెంపు, కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ, మహిళా ఉద్యోగులకు చైల్డ్‌కేర్ సెలవులు తదితర 21 ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి ముందుకు వచ్చిన నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టాల్సిన ఉద్యమ కార్యాచరణను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు వెల్లడించారు. త్వరలో జరిగే సమావేశం అనంతరం ప్రభుత్వ నిర్ణయాన్ని బట్టి తదుపరి కార్యాచరణను ప్రకటిస్తామని ఏపీ జేఏసీ అమరావతి జిల్లా నాయకులు తెలిపారు.

# జల్ సంచాయ్ - జల్ భాగిధారీలో వేగం పెంచాలి.

**..జలధార - జలహారతి విజయంతో జిల్లాకు సీఎం ప్రశంసలు.**

**..జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**




**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూలై 13:** జల్ సంచాయ్ -జల్ భాగిధారీ కార్యక్రమంలో చేపడుతున్న పనులను వేగవంతం చేయడంతో పాటు, జలధారజలహారతి కార్యక్రమంలో సాధించిన విజయాన్ని కొనసాగించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. జలధార - జలహారతి పనులను సమయానికి పూర్తి చేసినందుకు జిల్లా పర్యటన సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లా యంత్రాంగాన్ని ప్రత్యేకంగా అభినందించినట్లు ఆమె తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో అల్ట్రా హై డెన్సిటీ ప్లాంటేషన్, జల్ సంచాయ్జ-ల్ భాగిధారీ, జలధార -జలహారతి కార్యక్రమాల పురోగతిపై ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమావేశంలో భూగర్భ జలాల శాఖ అధికారి రఘురాం, డ్వామా పీడీ సూర్యనారాయణమూర్తి, హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ కోఆర్డినేటర్ అంకిత తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అల్ట్రా హై డెన్సిటీ ప్లాంటేషన్, జల్ సంచాయ్ - జల్ భాగిధారీ కార్యక్రమాలకు సంబంధించిన ఫోటోలను మరోసారి పరిశీలించి, నాణ్యమైన ఫోటోలను మాత్రమే అప్‌లోడ్ చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా ఎంపికైన 50 జిల్లాలకు కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఇందులో మొదటి బహుమతిగా రూ.2 కోట్లు, రెండో బహుమతిగా రూ.1 కోటి, మూడో బహుమతిగా రూ.50 లక్షలు, నాలుగో బహుమతిగా రూ.25 లక్షలు అందజేస్తారని పేర్కొన్నారు. జలధార - జలహారతి కార్యక్రమంలో జిల్లాకు మొత్తం 2,031 పనులు మంజూరు కాగా, వాటిలో 1,960 పనులు నిర్దేశిత గడువులో పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన 71 పనులను ఆత్మకూరు, బండి ఆత్మకూరు, ఆళ్లగడ్డ మండలాల్లో అత్యంత వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాల ద్వారా గతంతో పోలిస్తే భూగర్భ జలాల నిల్వ సామర్థ్యం ఎంత మేర పెరిగింది, నీటి రీచార్జ్ సామర్థ్యంలో ఎలాంటి మార్పు వచ్చింది అనే అంశాలను కూడా శాస్త్రీయంగా పరిశీలిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ వివరాలు భవిష్యత్ నీటి వనరుల ప్రణాళికకు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. అదేవిధంగా వీబీ రామ్‌జీ పనులకు సంబంధించి ఈ నెలకు రూ.8.40 లక్షల లక్ష్యాన్ని నిర్దేశించినట్లు తెలిపారు. లక్ష్య సాధన కోసం అధిక సంఖ్యలో ఉపాధి శ్రామికులు పనులకు హాజరయ్యేలా గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

# మురుగునీటి శుద్ధికి రూ.150 కోట్ల ప్రాజెక్టుకు శ్రీకారం

**అమృత్ 2.0 కింద 35 ఎంఎల్‌డీ ట్రీట్మెంట్ ప్లాంట్‌కు భూమిపూజ చేసిన మంత్రి టీజీ భరత్, ఎంపీ బస్తిపాటి నాగరాజు**



**కర్నూలు (ఆంధ్ర ప్రగతి జూలై 13)** కర్నూలు నగరం నుంచి వచ్చే మురికి నీటిని శుద్ధి చేయడానికి అమృత్ 2.0 పథకం కింద రూ.150 కోట్ల వ్యయంతో 35 ఎంఎల్డీ సామర్థ్యం గల ట్రీట్మెంట్ ప్లాంట్ నిర్మాణానికి పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ గుప్త భూమిపూజ నిర్వహించారు. పార్లమెంట్ సభ్యులు బస్తిపాటి నాగరాజు, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లుతో కలిసి పైలాన్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంకల్పం మేరకు మురికి నీరు నదుల్లో కలవకుండా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. గతంలో తుంగభద్ర నదిలో మురికి నీరు కలవడం వల్ల ప్రజలు, పుష్కర యాత్రికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. 18 నెలల్లో ప్లాంట్ నిర్మాణాన్ని పూర్తి చేసి, శుద్ధి చేసిన నీటిని పరిశ్రమలు, వ్యవసాయం తదితర అవసరాలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమాంతరంగా అమలు చేస్తోందని, సూపర్ సిక్స్ పథకాలతో పాటు రహదారుల అభివృద్ధి, పరిశ్రమల స్థాపన వంటి కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నామని మంత్రి వివరించారు.

పార్లమెంట్ సభ్యులు బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ, డబుల్ ఇంజిన్ సర్కార్ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అధిక నిధులు సాధించి కర్నూలు అభివృద్ధికి కృషి చేస్తున్నామని చెప్పారు. కర్నూలును స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దేందుకు మంత్రి టీజీ భరత్ నిరంతరం కృషి చేస్తున్నారని ప్రశంసించారు. కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు కూడా నగరాభివృద్ధికి మంత్రి టీజీ భరత్, ఎంపీ నాగరాజు చేస్తున్న కృషిని అభినందించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ హజ్ కమిటీ డైరెక్టర్ నూరి మన్సూర్ అలీ ఖాన్, మున్సిపల్ కమిషనర్ చల్ల ఓబులేసు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ రఘు, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ రామ్మోహన్ యాదవ్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గురప్ప యాదవ్ తదితరులు పాల్గొన్నారు.